క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో రెండు రోజుల పాటు ఆధార్ ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు పందలపాక పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గురువారం సచివాలయం-1 వద్ద, శుక్రవారం సచివాలయం-2 వద్ద ఈ క్యాంప్‌లు ఉంటాయని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి

పెదపూడి: గ్రామ పరిశుభ్రతకు నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని జి.మామిడాడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి అన్నారు. జి.మామిడాడలో 44 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తుల నిమిత్తం రూ.25 వేలు నగదును కార్మికులకు బుధవారం అందజేశారు.

రోడ్డెక్కిన మురుగు



సినిమా థియేటర్ నుంచి వస్తున్న మురుగు నీరు ఇలా రోడ్డుపై..

రాజానగరం: మురుగు రోడ్డెక్కుతోంది.. ప్రజలకు పాట్లు తెస్తోంది.. స్థానిక సినిమా థియేటర్ ఎదురుగా ఉన్న పాత ఎన్‌హెచ్‌పై మురుగునీరు ప్రవహిస్తుండటంతో అటుగా వెళ్లే ప్రయాణికులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుకు ఇరువైపులా ఉన్న మేజర్ డ్రైన్ ఒకవైపు ఆక్రమణకు గురవడంతో సినిమా థియేటర్ నుంచి వచ్చే మురుగు దిగువకు పోయే మార్గం లేక ఇలా రోడ్డుపై ప్రవహిస్తుంది. పరిసరాలు మురుగుమయంగా మారుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించాలంటే ఇక్కడ ఆక్రమణలను తొలగించాలి. పూడుకుపోయిన కల్వర్టును పునరుద్ధరించాలి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సంక్రాంతి అతిథులు హరిదాసులు



హరిదాసులను సత్కరిస్తున్న రెడ్డి సురేష్‌శర్మ

అనపర్తి: ధనుర్మాసం ప్రారంభం నుంచి కనుమ రోజు వరకూ గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ హరి కీర్తనలు ఆలపించే హరిదాసులు సంక్రాంతి అతిథులని అనపర్తికి చెందిన సనాతన ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రెడ్డి సురేష్‌శర్మ అన్నారు. బుధవారం హరిదాసులు సత్యనారాయణ, రామకృష్ణలకు ఆయన నూతన వస్త్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెడ్డి సర్వలక్ష్మి, నాగదేవర బాలాజీశర్మ, రెడ్డి సతీష్, సబ్బెళ్ల రామారెడ్డి, ద్వారంపూడి శ్రీధర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ



కూనవరంలో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: మండలంలో పలు కుటుంబాలను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా బుధవారం పరామర్శించారు. కూనవరంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అయ్యల మాధవరావు తల్లి సత్యవేణి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న మేండు వీరబాబు, సుంకర వీరన్నలను కలసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మండపాక రాజమణి ఇటీవల మరణించగా మనువడు పంచాయతీ ఉప సర్పంచ్ మండపాక గణేష్‌ను పరామర్శించారు. కాటవరంలో ఆపరేషన్ చేసుకుని విశ్రాంతి తీసుకుంటున్న ఉప సర్పంచ్ కోన రామకృష్ణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, ఎంపీటీసీలు నల్లమోలు భాస్కర్, తాడేపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

గోకవరం: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలని తూర్పుగోదావరి జిల్లా డ్వామా పీడీ జీఎస్ రామ్‌గోపాల్ సూచించారు. కామరాజుపేట ఎర్రమ్మ చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వేతదారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం గోకవరం ఉపాధిహామీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏపీఓ పీఎస్ అప్పలరాజు, జేఈ అమూల్య రత్నరాజు, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

దరిచేరిన సుజలం..

- ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి
- నియోజకవర్గానికి జల్‌జీవన్ మిషన్ నిధులు
- రూ.46 కోట్లతో అభివృద్ధి పనులు



రాజంపేటలో సిద్ధమైన వాటర్ ట్యాంక్



ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీటి సరఫరా

సీతానగరం: జలం దరిచేరుతోంది.. ప్రజల దాహార్తి తీర్చుతుంది.. ఇంటింటికీ తాగునీరు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంది.. ఈ పనులు ఇప్పటికే ప్రారంభం కాగా పలుచోట్ల పూర్తి కావొస్తున్నాయి. జల్‌జీవన్ మిషన్ పథకం నిధులతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తోంది. తాగునీటిని బయటకు వెళ్లి తెచ్చుకునే విధానానికి స్వస్తి పలుకుతూ నేరుగా ఇంటికే కుళాయి ద్వారా అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన పనులు సత్ఫలితాలను ఇస్తున్నాయి. తద్వారా రాజానగరం నియోజకవర్గ ప్రజలకు తాగునీటి సమస్య తీరనుంది. సీతానగరం మండలంలో రూ.16 కోట్లు, రాజానగరం మండలంలో రూ.16 కోట్లు, కోరుకొండ మండలంలో రూ.14 కోట్ల జల్‌జీవన్ మిషన్ నిధులు కేటాయించారు. వీటికి సంబంధించిన పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు 90 శాతం, మిగిలిన పది శాతం ప్రజల భాగస్వామ్యంతో ఇంటింటికీ కుళాయిలు వేసి, తాగునీటిని అందించనున్నారు. రాజానగరం మండలంలో 32 ఆవాస ప్రాంతాలు ఉండగా వాటిలో 28 చోట్ల పనులు జరుగుతున్నాయి. కోరుకొండ మండలంలో 24 ఆవాస ప్రాంతాలకు గాను అన్నిచోట్లా పనులు చేస్తున్నారు. సీతానగరం మండలంలో 33 చోట్లకు ప్రస్తుతానికి 13 చోట్ల పనులు జరుగుతుండగా చివర దశకు చేరకున్నాయి. మరో నెల రోజుల్లో ప్రారంభోత్సవాలు జరుగనున్నాయి. వెదుళ్లపల్లి, మునికూడలి, రాజంపేట, మిర్తిపాడు, ఉండేశ్వరపురం, ముగ్గళ్ల, నల్గొండ, పెదకొండేపూడి, చినకొండేపూడి, చీపురపల్లి, కాటవరం గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేశారు. రాపాకలో వాటర్ ట్యాంక్ ఉన్నందున పైప్‌లైన్లు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. నేరుగా ప్రతి ఇంటికి తాగునీటిని కుళాయిల ద్వారా అందించనున్నారు. అలాగే అవసరమైన గ్రామాల్లో బోర్లు ఏర్పాటు చేశారు. ఇవి ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్నాయి. మండలంలో మిగిలిన గ్రామాల్లో పనులు చేయడానికి టెండర్లు పిలుస్తున్నారు. ఇవి ఖరారైతే పనులు చేపట్టే అవకాశం ఉంది.

త్వరలోనే నీరు అందిస్తాం..



సీతానగరం మండలంలో 13 గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పథకంలో ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నాం. అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా వాటర్ ట్యాంక్‌లను నిర్మించాం. పైప్ లైన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. త్వరలోనే తాగునీటిని అందించడానికి అన్నీ సిద్ధం చేస్తున్నాం.

–వి.అవినాష్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

కృష్ణారెడ్డికి అభినందనలు



కృష్ణారెడ్డిని అభినందిస్తున్న రంగంపేట వైఎస్సార్ సీపీ నాయకులు

రంగంపేట: అనపర్తి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సబ్బెళ్ళ కృష్ణారెడ్డిని బుధవారం రంగంపేట మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన కృష్ణారెడ్డికి సముచిత స్థానం కల్పించినందుకు అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. అభినందనలు తెలియజేసిన వారిలో మండల పరిషత్ సభ్యుడు మట్టా శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లా దుర్గాప్రసాద్, టి.శివశంకర్, కొండేపూడి సత్తిబాబు, నర్ల చక్రరావు తదితరులున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఉగాదికి సామూహిక గృహ ప్రవేశాలు
- మండల పరిషత్తు సమావేశంలో ఎంపీపీ సీతారత్నం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సలహా కమిటీ సభ్యుడు మండారపు వీర్రాజు

రాజానగరం: గడచిన మూడున్నరేళ్లలో మండలంలో వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా అర్హులకు రూ.150 కోట్ల మేర లబ్ధి చేకూరిందని ఎంపీపీ మండారపు సీతారత్నం తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా అర్హతే ప్రమాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని, సీఎం జగన్ ప్రభుత్వంలో పేదలకు మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రంలో సుమారు 37 లక్షల మందికి ఒకేసారి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయగా, మండలంలో సుమారు 10 వేల మందికి లబ్ధి చేకూరిందని ఆమె అన్నారు. ఇందులో ఇల్లు నిర్మించుకునేందుకు అనుమతులు లభించిన లబ్ధిదారులచే మార్చి నెలాఖరుకు నిర్మాణాలు పూర్తి చేసే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ బి.రామారావు మాట్లాడుతూ ఇప్పటి వరకూ 622 మంది మాత్రమే గృహ నిర్మాణాలు పూర్తి చేశారని, 1,440 ఇళ్ల నిర్మాణ దశలో, 3,290 నిర్మాణాలు పునాది దశలో ఉన్నాయన్నారు. ఉగాది రోజున రాష్ట్ర వ్యాప్తంగా జరిగే సామూహిక గృహ ప్రవేశాలకు వీటిని సిద్ధం చేయాలని గృహ నిర్మాణ, పంచాయతీరాజ్ శాఖల అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి నిర్వహిస్తున్న భూముల రీసర్వే త్వరితగతిన పూర్తి చేసేందుకు రైతులంతా సహకరించాలని తహసీల్దార్ పవన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

26 నుంచి ప్లాస్టిక్ నిషేధం

కానవరంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, ఇందులో ఎస్సీ కాలనీలో ఉన్న కేంద్రం మినహా మిగిలిన రెండూ సక్రమంగా పనిచేయడం లేదని మండల కోఆప్షన్ సభ్యుడు కోడి రాఘవ ఆరోపించారు. సంపూర్ణ పారిశుధ్యంలో భాగంగా గ్రామాల్లో నిర్మిస్తున్న సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ స్కీమ్‌కు సంబంధించిన షెడ్లను నిర్మించాలని ఈఓపీఆర్డీ జొజ్జిరాజు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. దీనికి రామస్వామిపేటలో అవసరమైన స్థలాన్ని సేకరించాలన్నారు. మండలంలో ప్రజల నుంచి వసూలు చేసే వివిధ రకాల పన్నులను నెలాఖరు నాటికి నూరు శాతం పూర్తి చేయాలన్నారు. మార్చి వరకూ ఉంటే సర్‌చార్జ్‌లు పడతాయనే విషయాన్ని గుర్తించాలన్నారు. సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని ప్రభుత్వం జనవరి 26 నుంచి నిషేధిస్తున్నందున మండలంలో కూడా పూర్తిస్థాయిలో అమలు జరిగే విధంగా శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో సలహా కమిటీ సభ్యుడు మండారపు వీర్రాజు, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

అనపర్తిలో భారీ అన్న సమారాధన



అన్న సమారాధన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: అనపర్తి వీరుళ్ళమ్మ అమ్మవారికి ఐదు రోజుల పాటు జరిగిన జాతర, తీర్థ ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం సమీపంలో బుధవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నసమారాధనను ప్రారంభించారు. సుమారు 10 వేల మంది హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు నేషనల్ వెంకటరెడ్డి, వీరుళ్లమ్మ ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ



కాండ్రేగులలో పట్టాదారు పాస్‌పుస్తకం పంపిణీ చేస్తున్న తహసీల్దార్

పెదపూడి: రైతులకు కొత్తగా మంజూరైన పట్టాదారు పాస్ పుస్తకాలను వేగంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ టి.సుభాష్ ఆదేశించారు. కాండ్రేగుల గ్రామంలో పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుభాష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూముల రీసర్వేతో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. మండలంలో 6000 పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు కాగా వాటిలో 3500 పుస్తకాల పంపిణీ పూర్తయిందని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో పీఎస్‌హెచ్ ప్రసాద్‌రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో సమష్టితత్వం



విజేత జట్టుకు షీల్డ్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: క్రీడలతో సమష్టితత్వం, క్రీడా స్ఫూర్తి పెంపొందుతాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కుతుకులూరులో భక్తాంజనేయస్వామి క్రికెట్ టోర్నమెంట్ బహుమతి ప్రధానోత్సవ సభ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో శారీరక శ్రమ లేక యువత అనేక రుగ్మతలకు లోనవుతున్నారన్నారు. క్రీడల వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సంక్రాంతి సందర్భంగా ఏటా పోటీలను నిర్వహిస్తున్న నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా కుతుకులూరు జట్టు, రన్నర్స్‌గా రామచంద్రపురం జట్టు నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విన్నర్స్ జట్టుకు రూ.25 వేలు నగదు, షీల్డ్, రన్నర్స్ జట్టుకు రూ.15 వేలు నగదు, షీల్డ్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. పోటీల్లో ఆల్ రౌండ్ ప్రతిభ కనబరిచిన కుతుకులూరుకు చెందిన సునీల్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గణేష్, బెస్ట్ బ్యాట్స్‌మెన్ వాసు, బెస్ట్ కీపర్ ముకేష్(కుతుకులూరు), బెస్ట్ ఫీల్డర్ రవి, అత్యధిక వ్యక్తిగత స్కోర్ సాధించిన పండు(రామచంద్రపురం)లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లు హేమతులసి సురేష్, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, పడాల హరిసాయికృష్ణారెడ్డి, పడాల శ్రీనివాసరెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ సత్తి దొరయ్యరెడ్డి, కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, నల్లమిల్లి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనంద డోలిక



ఆత్మీయ కలయికలో పాల్గొన్న 1992-93 బ్యాచ్ విద్యార్థులు

బిక్కవోలు: కొంకుదురు ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1992-93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బుధవారం పాఠశాలలో కలుసుకుని సందడి చేశారు. దాదాపు మూడు దశాబ్దాల తరువాత కలవడంతో చిన్ననాటి జ్ఞాపకాల్ని నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విజయ్, టీఎస్‌ఎన్ రెడ్డి, వెంకటరెడ్డి, భువన్, సునీత, సుధ తదితరులు పాల్గొన్నారు.

రాజా కాన్వెంట్ పూర్వ విద్యార్థులు..

బిక్కవోలు: బలభద్రపురంలోని రాజా కాన్వెంట్‌లో 1999-2006 సంవత్సరాల్లో విద్యనభ్యసించిన విద్యార్థులు బుధవారం ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని ఏర్పాటుచేసుకున్నారు. చిన్ననాటి మధురస్మృతుల్ని గుర్తు చేసుకుంటూ రోజంతా ఆనందోత్సాహాలతో గడిపారు. తమ పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.రాజ్‌కుమార్, మేడం లిడియా గ్రేస్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎం.లలిత, భానుమతి, లక్ష్మి, చంద్రకళ పాల్గొన్నారు.

స్నేహ బంధం... ఎంత మధురం

అనపర్తి: 'ఆనాటి ఆ స్నేహమానంద గీతం... ఆ జ్ఞాపకాలన్నీ మధురాతి మధురం..' అంటూ స్నేహ గీతం పాడుకున్నారు రామవరం మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1992-93 బ్యాచ్ విద్యార్థులు.. ఎక్కడెక్కడో స్థిరపడిన స్నేహితులంతా బుధవారం రామవరం జెట్లారెడ్డి కల్యాణ మండపంలో కలుసుకున్నారు. మూడు దశాబ్దాల తరువాత కలిసిన మిత్రులంతా చిన్ననాటి మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. అనంతరం తమ స్నేహ బంధానికి గుర్తుగా ఫొటోలు దిగారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదాలు అందుకున్నారు. గ్రామానికి చెందిన పడాల వెంకటరామిరెడ్డి, మునిరెడ్డి, చంటిరెడ్డి, సరేంద్రరెడ్డి, వీరేంద్ర, నాగసుధ తదితరుల చొరవతో పూర్వ విద్యార్థుల కలయిక జరిగిందని నిర్వాహకులు తెలిపారు.



రామవరంలో ఆత్మీయ సమ్మేళనంలో 1992-93 బ్యాచ్ విద్యార్థులు



బలభద్రపురంలో ఆత్మీయ కలయికలో..

వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల అధ్యక్షుడిగా గద్దె



గద్దె వెంకట కృష్ణచౌదరి

సీతానగరం: రాజానగరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల అధ్యక్షుడిగా, పార్టీలో చేరికల కమిటీ కన్వీనర్‌గా గద్దె వెంకట కృష్ణచౌదరి (నల్లి)ని నియమించినట్లు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీతానగరం మండలం వంగలపూడికి చెందిన ఆయన ఎంపికపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది. సీతానగరం, రాజానగరం, కోరుకొండ మండలాల్లో 210 బూత్ కమిటీలు ఉన్నాయి. ఈ కమిటీలను పర్యవేక్షిస్తూ పార్టీ అభివృద్ధికి, బలోపేతానికి కృషి చేయాల్సి ఉంది. ఆయనకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తూ రెండు కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా వెంకట కృష్ణచౌదరి మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. రెండు కీలక పదవులు అప్పగించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు

అనపర్తి: తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు చిరస్మరణీయుడని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 26వ వర్ధంతిని బుధవారం మండలంలోని రామవరం, పొలమూరు, చిన పొలమూరు తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా అనపర్తి ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోకవరం: ఏపీ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతిని బుధవారం గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక తాణా సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మంగరౌతు రామకృష్ణ, గునిపే భరత్, పులపర్తి బుజ్జి, ఉంగరాల గణేష్, ఆచంట రాజు, పిల్లా అర్జునసారథి తదితరులు పాల్గొన్నారు.

మధురపూడి: మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ నాయకుడు బర్ల బాబూరావు ఆధ్వర్యంలో భోజనం ప్యాకెట్ల వితరణ జరిగింది. శ్రీరంగపట్నంలో మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, బూరుగుపూడిలో కంటే నాగేశవరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

సీతానగరం: రఘుదేవపురంలో వార్డు సభ్యుడు చుండ్రు సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. చిట్టూరి లక్ష్మణ్, కాండ్రు కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముసలమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో పుంతలో ముసలమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గరగ నృత్యాలు, తీన్‌మార్ డప్పులు, బ్యాండ్ మేళాలతో ముసలమ్మ అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు.

ఉద్యోగావకాశాలకు ఎన్‌సీసీ దోహదం



ఎన్‌సీసీ క్యాడెట్లకు రైఫిల్ షూటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాజానగరం: భవిష్యత్తులో మంచి ఉద్యోగాలను సాధించేందుకు ఎన్‌సీసీ దోహదపడుతుందని ఎన్‌సీసీ 3వ బాలికల బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ దుష్యంత్ కులశ్రేష్ట అన్నారు. దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో వారం రోజులుగా నిర్వహించిన వార్షిక శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. అనంతరం ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 20 పాఠశాలల నుంచి సుమారు 500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరు కాగా, వారిలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపాల్ ఏఎస్‌ఎన్ మూర్తి, ఏఎన్‌ఓ ఓలేటి స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

వైద్య విజ్ఞాన సదస్సు

గోకవరం: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించే పీఎంపీలు దోమకాటు జ్వరాల (వైరల్ జ్వరాలు)పై అవగాహన పెంచుకోవాలని రాజమహేంద్రవరానికి చెందిన ఫస్ట్ ప్లస్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ బీఆర్ కళాధర్‌రెడ్డి సూచించారు. స్థానిక బావాజీపేట గ్రామ శివారున బుధవారం పీఎంపీ అసోసియేషన్ మండలాధ్యక్షుడు పి.చిన్ని ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ కళాధర్‌రెడ్డి మాట్లాడుతూ మలేరియా, డెంగీ వంటి దోమకాటు జ్వరాలను గుర్తించే విధానం, ప్రాథమిక చికిత్స తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, జిల్లా కార్యదర్శి బళ్లా శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
గొల్లలమామిడాడ బ్రాంచి, 5-109, మెయిన్‌రోడ్, గొల్లలమామిడాడ, పెదపూడి మండలం, తూర్పు గోదావరి జిల్లా, ఎ.పి.-533344.
☎ 9324502491, email: ubin0802942@unionbankofindia.bank

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(1))

[illegible] ... రూ.16,60,004.15 (అక్షరాల పదహారు లక్షల అరవై వేల నాలుగు రూపాయలు మరియు పదిహేను పైసలు మాత్రమే) ... తేది.23-09-2022 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది. [illegible] ... 13-01-2023 తేదీన ... [illegible] ... రూ.16,60,004.15 ... యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గొల్లలమామిడాడ బ్రాంచ్ ... [illegible]

తనఖాపెట్టబడిన ఆస్తి వివరములు
[illegible]
ఐటమ్ నెం-I : 55 చ॥గ॥ ... [illegible]
ఐటమ్ నెం-II : 10.5 చ॥గ॥ ... [illegible]
ఐటమ్ నెం-III : 27 చ॥గ॥ ... [illegible] ... 92.5 చ॥గ॥ ... [illegible]

తేది : 13-01-2023 — సం/- అధీకృత అధికారి
ప్రదేశము : గొల్లలమామిడాడ — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా